రాగం: ఆనందభైరవి

తాళం: ఆది

అంతయు నీవే హరి పుండరీకాక్ష

చెంతనాకు నీవే శ్రీరఘురామ

1. కులమును నీవే గోవిందుడా నా

కలిమియు నీవే కరుణానిధి

తలపును నీవే ధరణీధరా నా

నెలవును నీవే నీరజనాభ

2. తనువును నీవే దామోదరా నా

మనికియు నీవే మధుసూదనా

వినికియు నీవే విఠ్ఠలుడా నా

వెనకముందు నీవే విష్ణుదేవుడా

3. పుట్టుగు నీవే పురుషోత్తమా కొన

నట్ట నడుము నీవే నారాయణా

యిట్టె శ్రీవేంకటేశ్వరుడా నాకు

నెట్టిన గతి యింక నీవే నీవే